

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 23-07-2026 | సంపుటి - 30 | సంచిక - 60 | రూ : 4 | పేజీలు: 8

# లాఠీలు, తూటాలకు కాంగ్రెస్ భయపడదు

## గాంధీలపై దాడి.. ప్రజాస్వామ్యానికి చీకటి రోజు

- కొడంగల్ ధర్నాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం
- మోదీ, ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపాటు




**వికారాబాద్, 22 జూలై :** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎంపీ ప్రియాంకా గాంధీపై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి చీకటి రోజని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యులైన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ ప్రధాని మోదీ నివాసం ముందు ధర్నా చేస్తున్న వారిపై దాడికి నిరసనగా బుధవారం వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "దేశ ప్రజల కోసం గాంధీ కుటుంబం రక్తం చిందించి పదవులను త్యాగం చేసింది. అలాంటి వారిపై దాడి హేయం. మహాత్మాగాంధీపై లాఠీ ఎత్తడానికి ఆంగ్లేయులే సాహసించలేదు. వీళ్లు మాత్రం స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదిలోపే హత్యకు పాల్పడిన గాడ్సే వారసులుగా పేరుగాంచారు" అని భాజపా వారిని ఉద్దేశించి సీఎం రేవంత్ అన్నారు. విద్యార్థుల తరువాయి 2లో



# భారాస హయాంలో పేదల గోడు వినేవారే కరవయ్యారు

- మంత్రి పొంగులేటి ధ్వజం
- 'క్యూర్' పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచన
- గాంధీభవన్‌లో 'ప్రజలతో ముఖాముఖి'లో సమస్యలపై వినతులు స్వీకరణ

2లో

# నీతి ఆయోగ్ సీఈవోగా అనురాగ్ జైన్ నియామకం



- రెండేళ్లపాటు సీఈవోగా బాధ్యతలు నిర్వహణ
- 1989 బ్యాచ్ మధ్యప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి
- కేంద్రం, రాష్ట్రాల్లో నాలుగు దశాబ్దాల పరిపాలనా అనుభవం
- విధానాల రూపకల్పన, అమలులో కీలక బాధ్యతలు
- 'వికసిత్ భారత్' లక్ష్యాలకు నాయకత్వం

2లో



# పార్లమెంట్‌కు నల్ల దుస్తుల్లో విపక్షాలు
# పోలీసుల దౌర్జన్యంపై ఆగ్రహం

- నల్ల దుస్తుల్లో పార్లమెంట్‌కు వచ్చిన ఇండియా కూటమి ఎంపీలు
- పోలీసుల తీరుకు నిరసనగా పార్లమెంట్ ఆవరణలో ఆందోళన
- పీఎం నివాసం వద్ద నిరసనలో రాహుల్‌ను అరెస్ట్ చేయడంపై ఆగ్రహం
- దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని ఆరోపించిన కాంగ్రెస్
- నీట్ వివాదంపై ప్రతిష్టంభనతో స్తంభించిన పార్లమెంట్ కార్యకలాపాలు

2లో



# పార్లమెంట్‌లో గళమెత్తుతుంటే మోదీతో శరద్ పవార్ భేటీ

ఊహాగానాలకు తెరలేపిన కీలక సమావేశం!

# ఉద్యోగాల సృష్టిలో విశాఖ టాప్..
# మెట్రోయేతర నగరాల్లో అగ్రస్థానం



- లింక్డ్‌ఇన్ విడుదల చేసిన తాజా నివేదికలో ఈ విషయం వెల్లడి
- ఈ జాబితాలో విశాఖ తర్వాత లుథియానా, సూరత్, వడోదర, ప్రయాగ్‌రాజ్
- సంప్రదాయ పరిశ్రమలతో పాటు టెక్నాలజీ, ఫైనాన్స్ రంగాల్లోనూ వృద్ధి
- పెరిగిన పోటీ నేపథ్యంలో చిన్న నగరాలు కొత్త అవకాశాలు అందిస్తున్నాయని వెల్లడి

2లో

# యూఏఈ వీసా ఆన్ అరైవల్..
## భారతీయులకు కొత్త రూల్స్

- అమెరికా, యూకే, ఈయూ వీసాలతో పాటు మరికొన్ని దేశాల రెసిడెన్స్ పర్మిట్లకు అవకాశం
- కనీసం 6 నెలల వ్యాలిడిటీ ఉన్న పాస్‌పోర్ట్ తప్పనిసరి
- 14 రోజుల వీసా.. మరో 14 రోజులు పొడిగించుకునే సౌకర్యం
- కేవలం భారత పాస్‌పోర్ట్‌తో ఈ వీసాకు అర్హత లభించదు





# కరవుపై విషప్రచారం చేయొద్దు

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఎల్‌నినోపై కేటీఆర్‌కు కనీస అవగాహన లేదని ఎద్దేవా

వరంగల్: 'అమెరికాలో చదువుకున్న వ్యక్తి.. పదేళ్లు మంత్రిగా కూడా పనిచేసిన అనుభవం ఉండి.. ఎల్‌నినో ప్రభావం, వాతావరణంలో ఏర్పడిన మార్పులపై కనీస అవగాహన లేకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉంది' అని కేటీఆర్‌ను ఉద్దేశించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినోతో కరవు పరిస్థితులు ఏర్పడినట్లు శాస్త్రవేత్తలు చెబుతుంటే.. 'కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరవు' అంటూ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను చూస్తుంటే నవ్వాలో.. ఏడవాలో అర్థం కావటం లేదని వ్యాఖ్యానించారు. బాధ్యత గల ప్రతిపక్షంగా మంచి సలహాలిస్తే స్వీకరిస్తామని... దుర్మార్గమైన విష ప్రచారం చేయొద్దని హితవు పలికారు. హనుమకొండలోని తరువాయి 2లో

# లాఠీలు, తూటాలకు కాంగ్రెస్ భయపడదు

(మొదటిపేజీ తరువాయి)

"దేశ ప్రజల కోసం గాంధీ కుటుంబం రక్తం చిందించి పదవులను త్యాగం చేసింది. అలాంటి వారిపై దాడి హేయం. మహాత్మాగాంధీపై లాఠీ ఎత్తడానికి ఆంగ్లేయులే సాహసించలేదు. వీళ్లు మాత్రం స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదిలోపే హత్యకు పాల్పడిన గాడ్సే వారసులుగా పేరుగాంచారు" అని భాజపా వారిని ఉద్దేశించి సీఎం రేవంత్ అన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రధాని మోదీ, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు. "లాఠీలు, తూటాలు కాంగ్రెస్‌కు కొత్త కాదు. కాంగ్రెస్ వాటికి భయపడదు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ చివరి రక్తం బొట్టు వరకు దేశం కోసం పోరాడారు. దేహం ముక్కలైనా రాజీవ్‌గాంధీ దేశం ఐక్యంగా ఉండాలని తపించారు. ప్రధాని అయ్యే అవకాశమున్నా.. సోనియాగాంధీ మాత్రం మన్మోహన్‌సింగ్‌కు పదవి కట్టబెట్టారు. రాహుల్‌గాంధీ సైతం పదవి కోసం పాకులాడలేదు. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలని మోదీ కుట్రకు తెరలేపితే ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్‌గాంధీ అడ్డుకునేందుకు బాధ్యత తీసుకున్నారు. నీట్ ప్రశ్నపత్రాలను భాజపా పాలిత రాష్ట్రాల్లో పల్లీ బఠాణీల్లా రూ.కోట్లకు అమ్ముకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారు" అని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

*** ఇక్కడ చక్రం తిప్పింది కేటీఆర్ బినామీలే..**

రాష్ట్రంలో 2019లో జరిగిన ఇంటర్ పరీక్షల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు




పాల్పడడంతో 25 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని సీఎం అన్నారు. "ప్రతిపక్ష నాయకుడిగా అప్పుడు ఆందోళన నిర్వహించా. న్యాయస్థానం ఆ సంస్థపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించినా అప్పటి భారాస సర్కారు చర్యలు తీసుకోలేదు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక.. పప్పులుడకవని అదే సంస్థ కేటీఆర్ సహకారంతో కేంద్రంలోని పెద్దలతో సంప్రదించి పేరు మార్చుకొంది. సీబీఎస్ఈ జవాబు పత్రాలను దిద్దే కాంట్రాక్టు తీసుకొని అవకతవకలకు పాల్పడింది. క్రమంగా ధర్మేంద్ర ప్రధాన్‌తో ఒప్పందం చేసుకొని మరింత విజృంభించింది. భాజపా పాలిత రాష్ట్రాల్లో అక్రమాలకు తెరదీసి రూ.కోట్ల కుంభకోణాలు చేసింది. అప్పుడే ఆ సంస్థపై చర్యలు తీసుకుంటే నీట్‌లో అక్రమాలకు చోటుండేది కాదు. నీట్ విషయంలో కేంద్రమంత్రి రాజీనామా చేయాలని వేలమంది విద్యార్థులు, యువకులు దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ నిరసన తెలిపితే పోలీసులు లాఠీఛార్జి చేశారు.

# కరవుపై విషప్రచారం చేయొద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో బుధవారం ఆయన రూ.56 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. "కాళేశ్వరానికి ఎగువన కాంగ్రెస్ హయాంలో 20 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి బ్యారేజీ, ఆరు దశాబ్దాల కిందట కాంగ్రెస్ ప్రభుత్వమే నిర్మించిన ఎస్సారెస్పీ గోదావరి ఉద్ధృతిలోనూ చెక్కు చెదరకుండా ఉన్నాయి. భారాస హయాంలో కేవలం 5 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ మూడేళ్లకే ఎందుకు కూలిపోయిందో నీటిపారుదలశాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు చెప్పాలి" అని పేర్కొన్నారు.

*** విద్యుత్తు వ్యవస్థపై అదనపు భారం**

"సాధారణంగా వానాకాలంలో రాష్ట్రంలో 11 వేల మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ ఉండేది. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణం వేసవిని తలపిస్తుండడంతో అనూహ్యంగా 16,500 మెగావాట్ల డిమాండ్ ఏర్పడింది. విద్యుత్తు పంపిణీపై తీవ్రస్థాయిలో ఒత్తిడి పెరిగింది. అయినా సిబ్బంది అహర్నిశలు శ్రమించి.. ప్రజలకు ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా ఉచిత, నాణ్యమైన విద్యుత్తు అందిస్తున్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి ఎత్తిపోతల పథకాలతో పాటు వర్షాభావంతో రైతులు బోర్లు వాడటంతో పెరిగిన విద్యుత్తు డిమాండ్‌ను విజయవంతంగా నిర్వహించారు. గతంలో ఎక్కువ వడ్డీకి తెచ్చిన రుణాలను రీస్ట్రక్చరింగ్ చేసి ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌లను దేశంలోనే నం1 గా నిలుపుతాం. విద్యుత్తు సేవా ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు దేశంలోనే ప్రథమంగా తెలంగాణలో ఎలక్ట్రిసిటీ అంబులెన్సులను అందుబాటులోకి తెచ్చాం. టోల్‌ఫ్రీ నం.1912లో సంప్రదిస్తే.. అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుంటారు. రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు అయ్యే విద్యుత్తు బిల్లు రూ.14 వేల కోట్లను ఆర్థిక శాఖ నేరుగా డిస్కంలకు అందిస్తోంది" అని భట్టి వివరించారు. విద్యుత్తు ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రమాదంలో మరణం సంభవిస్తే.. ఆ కుటుంబానికి రూ.1.20 కోట్ల బీమా సౌకర్యం అమలు చేస్తున్నామని తెలిపారు. శంకుస్థాపనలు, సమీక్ష సమావేశంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, సత్యశారద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నీతి ఆయోగ్ సీఈవోగా అనురాగ్ జైన్ నియామకం

సీనియర్ ఐఏఎస్ అధికారి అనురాగ్ జైన్‌ను నీతి ఆయోగ్ కొత్త ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈవో)గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేంద్ర మంత్రివర్గ నియామకాల కమిటీ (ఏసీసీ) ఆమోదం తెలిపింది. ఆయన రెండేళ్లపాటు లేదా తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఈ బాధ్యతలు నిర్వహించనున్నారు. 1989 బ్యాచ్‌కు చెందిన మధ్యప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన అనురాగ్ జైన్‌కు దాదాపు నాలుగు దశాబ్దాల పరిపాలనా అనుభవం ఉంది. కేంద్ర, మధ్యప్రదేశ్ ప్రభుత్వాల్లో పలు కీలక పదవులు నిర్వహించిన ఆయన మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక విధానాలు, పెట్టుబడుల ప్రోత్సాహం, పరిపాలనా సంస్కరణల అమలులో విశేష అనుభవాన్ని సంపాదించారు. నీతి ఆయోగ్ సీఈవోగా ఆయన కేంద్ర ప్రభుత్వ విధానాల రూపకల్పన, అమలు, రాష్ట్రాలతో సమన్వయం, దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించనున్నారు. అలాగే 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు అవసరమైన విధానాల అమలును ముందుకు తీసుకెళ్లడంతో పాటు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి వంటి అంశాలపై నీతి ఆయోగ్ చేపడుతున్న కార్యక్రమాలకు నాయకత్వం వహించనున్నారు.

# పార్లమెంట్‌కు నల్ల దుస్తుల్లో విపక్షాలు.. పోలీసుల దౌర్జన్యంపై ఆగ్రహం

ప్రధాని అధికారిక నివాసం వద్ద మంగళవారం జరిగిన హైడ్రామా అనంతరం, బుధవారం ఇండియా కూటమి ఎంపీలు తమ నిరసనను తీవ్రతరం చేశారు. పోలీసుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ ఎంపీలందరూ నల్ల దుస్తులు ధరించి పార్లమెంట్‌కు చేరుకున్నారు. పార్లమెంట్ వెలుపల గుమిగూడిన విపక్ష నేతలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన 'చలో సంసద్' మార్చ్‌కు మద్దతుగా నిన్న విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ క్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సహా పలువురు ఇండియా కూటమి నేతలు ప్రధాని నివాసం వద్ద నిరసనకు యత్నించారు. అయితే, పోలీసులు వారిని బలవంతంగా అదుపులోకి తీసుకుని వ్యాన్లు, బస్సుల్లో తరలించారు. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ఈ అరెస్టులు, పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తూ విపక్ష ఎంపీలు నేడు నల్ల దుస్తుల్లో పార్లమెంట్‌కు వచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ సహా పలు పార్టీల ఎంపీలు మకర ద్వార్ వద్ద నిలబడి ప్రభుత్వ వైఖరిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ మాట్లాడుతూ.. "నిన్న ప్రతిపక్ష నేతను సిగ్గులేకుండా అరెస్ట్ చేసి, గాయపరిచిన తీరు దారుణం. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతోందని చెప్పడానికి ఇదే నిదర్శనం. రాజ్యాంగం ఉనికిలో లేదు. ఈ ప్రభుత్వంతో శాంతియుతంగా పోరాడటమే మా ముందున్న ఏకైక మార్గం" అని తీవ్రంగా విమర్శించారు. మరో కాంగ్రెస్ ఎంపీ కె. సురేశ్ మాట్లాడుతూ.. "ప్రతిపక్ష నేత, ఇతర ఎంపీలపై పోలీసులు జరిపిన దౌర్జన్యానికి నిరసనగానే మేమంతా నల్ల దుస్తులు ధరించి నిరసన తెలుపుతున్నాం" అని అన్నారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ప్రభుత్వం, విపక్షాల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరడంతో పార్లమెంట్ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ వివాదం కారణంగా ఉభయ సభల్లోనూ ప్రతిష్టంభన కొనసాగుతోంది.

### పార్లమెంట్‌లో గళమెత్తుతుంటే

# మోదీతో శరద్ పవార్ భేటీ

ఒకవైపు నీట్ లీకేజీతో పాటు పలు అంశాలపై పార్లమెంట్ వెలుపల విపక్ష ఎంపీలు తీవ్ర స్థాయిలో నిరసనలు, నినాదాలతో హోరెత్తిస్తుంటే... మరోవైపు ప్రధాని కార్యాలయంలో జరిగిన ఒక కీలక భేటీ దేశ రాజకీయాల్లో పెను దుమారాన్ని రేపుతోంది. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్, ఆయన కుమార్తె సుప్రియా సూలేలు ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోల్లో ప్రధాని మోదీ స్వయంగా శరద్ పవార్‌ను చిరునవ్వుతో చేతిని పట్టుకుని ఆహ్వానించడం, ఇద్దరు నాయకులు ఎంతో సంతోషంగా నవ్వుకుంటూ చర్చించుకోవడం కనిపించింది. రైతుల సమస్యలు, నీటిపారుదల రంగానికి సంబంధించిన పలు అంశాలపై పవార్ ప్రధానికి వినతిపత్రం సమర్పించినట్లు సమాచారం. ప్రస్తుత పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మూడింట రెండొంతుల మెజారిటీ కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఈ సమయంలో 8 మంది ఎంపీలు ఉన్న శరద్ పవార్ పార్టీ మద్దతు ప్రభుత్వానికి చాలా కీలకంగా మారింది. దేశవ్యాప్తంగా 50 శాతం సీట్ల పెంపుపై ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇస్తే ఈ బిల్లుకు మద్దతు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని ఇటీవలే సుప్రియా సూలే సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామాల మధ్య శరద్ పవార్ పార్టీ ఎన్డీఏ కూటమిలో చేరుతుందనే ఊహాగానాలు కూడా మొదలయ్యాయి. అయితే, మహారాష్ట్రలోని రెండు ఎన్సీపీ వర్గాలు (అజిత్ పవార్, శరద్ పవార్ వర్గాలు) మళ్లీ విలీనమైతేనే ఎన్డీఏలో అధికారికంగా భాగస్వామ్యం కల్పిస్తామని, వ్యక్తిగతంగా లేదా విడివిడిగా చేర్చుకునే ఉద్దేశం లేదని బీజేపీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. విపక్ష ఇండియా కూటమి కేంద్ర ప్రభుత్వంపై విమర్శల దాడిని తీవ్రతరం చేసిన సమయంలోనే, ఆ కూటమిలోని కీలక నేత శరద్ పవార్ ప్రధానితో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది.

### ఉద్యోగాల సృష్టిలో..

# విశాఖ టాప్.. మెట్రోయేతర నగరాల్లో అగ్రస్థానం

భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రోయేతర నగరాల జాబితాలో విశాఖపట్నం మరోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఉద్యోగాల కల్పన, వలసల విషయంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ 'లింక్డ్ఇన్' నేడు విడుదల చేసిన నివేదికలో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ఈ జాబితాలో విశాఖ తర్వాత లుథియానా, సూరత్, వడోదర, ప్రయాగ్‌రాజ్ వరుసగా టాప్ 5 స్థానాల్లో ఉన్నాయి. ఈ నివేదిక ప్రకారం.. ఒకప్పుడు కేవలం సంప్రదాయ పరిశ్రమలకే పరిమితమైన ఈ నగరాలు ఇప్పుడు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. టెక్నాలజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, తయారీ, విద్య, మౌలిక సదుపాయాల కల్పన వంటి రంగాల్లో వస్తున్న పెట్టుబడులతో సరికొత్త ఉద్యోగావకాశాలను సృష్టిస్తున్నాయి. దీంతో ఈ నగరాలు బహుళ రంగాల జాబ్ మార్కెట్లుగా రూపాంతరం చెందుతున్నాయని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం దేశంలో ఉద్యోగాల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. ఈ ఏడాది సుమారు 72శాతం నిపుణులు కొత్త ఉద్యోగం కోసం చురుగ్గా వెతుకుతున్నారని, అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాకతో నైపుణ్యాల అంతరం పెరగడం, పోటీ ఎక్కువవడంతో ఉద్యోగ వేట కష్టతరంగా మారిందని 76శాతం మంది భావిస్తున్నట్లు నివేదిక తెలిపింది. 2022 ఆరంభంతో పోలిస్తే ప్రస్తుతం ఒక్కో ఉద్యోగానికి దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు అయింది. ఈ నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న నగరాలు సొంత ప్రాంతాలకు దగ్గరగా విభిన్నమైన కెరీర్ అవకాశాలను అందిస్తున్నాయి. ఈ విషయంపై లింక్డ్ఇన్ కెరీర్ నిపుణురాలు నీరజితా బెనర్జీ మాట్లాడుతూ.. "ఈ నగరాల్లోని సంప్రదాయ పరిశ్రమలకు ఇప్పుడు టెక్నాలజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటివి తోడవుతున్నాయి. ఉద్యోగార్థులు మెట్రో నగరాలను దాటి ఆలోచించాలి. ఏ రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయో, మీ నైపుణ్యాలు ఏయే పరిశ్రమలకు సరిపోతాయో చూసుకోవాలి" అని సూచించారు. విశాఖపట్నం తన సంప్రదాయ బలాలుగా ఉన్న పోర్టు, ఫార్మా, తయారీ రంగాలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, టెక్నాలజీ రంగాల్లోనూ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని నివేదిక వివరించింది. అదేవిధంగా లుథియానాలో స్టీల్, ఏవియేషన్, సూరత్‌లో స్టార్టప్‌లు, రియల్ ఎస్టేట్, వడోదరలో టెక్నాలజీ, ఇంజినీరింగ్ రంగాలు వేగంగా విస్తరిస్తున్నాయని పేర్కొంది.

# భారాస హయాంలో పేదల గోడు వినేవారే కరవయ్యారు

హైదరాబాద్: గత భారాస సర్కారు హయాంలో పేదల గోడు వినేవారే కరవయ్యారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని మాయమాటలు చెప్పి ఆ పార్టీ పేదలను మోసం చేసిందని ఆరోపించారు. గతంలో 'క్యూర్' పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన 'ప్రజలతో ముఖాముఖి'లో పొంగులేటి పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. రెవెన్యూ, భూ సంబంధిత సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లకు సంబంధించి దాదాపు 400 వరకు దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు సంబంధించి ధరణిలో తమ భూమి ఇతరుల పేరు మీద నమోదుచేశారనే ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. భూ సమస్యలకు సంబంధించి సూర్యాపేట, మహబూబాబాద్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల కలెక్టర్లతో పొంగులేటి ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను పరిశీలించి, నియమ నిబంధనలకు అనుగుణంగా ఉంటే సత్వరమే పరిష్కరించాలని వారికి సూచించారు. అనంతరం పొంగులేటి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'గత భారాస సర్కారు పేదలకు అరకొరగా నగరానికి 3040 కి.మీ. దూరంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించింది. ఫలితంగా తమ జీవనోపాధి దెబ్బతింటుందన్న ఆందోళనతో పేదలు ఆ ఇళ్లలో అడుగు కూడా పెట్టలేదు. ఈ రోజు నిర్వహించిన ముఖాముఖిలో ఇందిరమ్మ ఇళ్ల గురించి ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదవాడు పుట్టి, పెరిగిన చోటే నివాసం కల్పించాలన్న ఆలోచనతో నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని ఇందిరమ్మ టవర్స్ నిర్మించబోతున్నాం.

# యూఏఈ వీసా ఆన్ అరైవల్.. భారతీయులకు కొత్త రూల్స్

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వెళ్లాలనుకునే భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్లకు ఇది ముఖ్యమైన గమనిక. కేవలం భారత పాస్‌పోర్ట్ కలిగి ఉన్నంత మాత్రాన యూఏఈలో 'వీసా ఆన్ అరైవల్' సౌకర్యం లభించదు. నిర్దిష్ట దేశాల నుంచి పొందిన వ్యాలిడ్ వీసా లేదా రెసిడెన్స్ పర్మిట్ (నివాస అనుమతి) ఉన్న భారతీయులకు మాత్రమే ఈ సదుపాయం వర్తిస్తుంది. విదేశాల్లో నివసించే లేదా ప్రయాణించే భారతీయుల కోసం ప్రయాణ ప్రక్రియను సులభతరం చేసే లక్ష్యంతో యూఏఈ ప్రభుత్వం 2025 ఫిబ్రవరిలో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించింది. ఈ నేపథ్యంలో ఎవరు అర్హులు, ప్రయాణానికి ముందు ప్రయాణికులు ఏయే విషయాలు చూసుకోవాలనే పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

**ఎవరు అర్హులు?**

ఈ వీసా ఆన్ అరైవల్ సౌకర్యం పొందాలంటే భారతీయ పౌరులు కొన్ని నిర్దిష్ట ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. వారి సాధారణ పాస్‌పోర్ట్ కనీసం ఆరు నెలల వ్యాలిడిటీ కలిగి ఉండాలి. దీంతో పాటు కింది దేశాల నుంచి జారీ చేసిన వ్యాలిడ్ వీసా, గ్రీన్ కార్డ్ లేదా రెసిడెన్స్ పర్మిట్ తప్పనిసరిగా ఉండాలి. గతంలో ఈ సౌకర్యం కేవలం అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ లేదా యూరోపియన్ యూనియన్ (ఈయూ) సభ్య దేశాల వీసా లేదా రెసిడెన్స్ పర్మిట్ ఉన్నవారికి మాత్రమే అందుబాటులో ఉండేది. అయితే, 2025 ఫిబ్రవరి 13 నుంచి యూఏఈ ప్రభుత్వం ఈ జాబితాను విస్తరించింది. కొత్తగా కింద పేర్కొన్న దేశాల రెసిడెన్స్ పర్మిట్లు ఉన్న భారతీయులకు కూడా ఈ అర్హతను కల్పించింది. ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా, సింగపూర్, యూఏఈ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం ఈ విస్తరణ యూఏఈలోని అన్ని ఎంట్రీ పాయింట్ల వద్ద వర్తిస్తుంది.

**అవసరమైన పత్రాలు ఏవి?**

* అర్హత ఉన్న ప్రయాణికులు తమ వెంట కింది డాక్యుమెంట్లను తప్పనిసరిగా ఉంచుకోవాలి:
* కనీసం ఆరు నెలల వ్యాలిడిటీ ఉన్న భారతీయ పాస్‌పోర్ట్.
* అనుమతి పొందిన దేశాల నుంచి జారీ చేయబడిన వ్యాలిడ్ వీసా, గ్రీన్ కార్డ్ లేదా రెసిడెన్స్ పర్మిట్.
* ఇమ్మిగ్రేషన్ అధికారులు అడిగే ఇతర సహాయక ప్రయాణ పత్రాలు.

ప్రయాణికులు యూఏఈలోకి ప్రవేశించే తేదీ నాటికి తమ క్వాలిఫైయింగ్ వీసా లేదా రెసిడెన్స్ పర్మిట్ చెల్లుబాటులో ఉందని నిర్ధారించుకోవాలి. ఎయిర్‌లైన్ సిబ్బంది మరియు యూఏఈ ఇమ్మిగ్రేషన్ అధికారులు ప్రయాణానికి లేదా దేశంలోకి ప్రవేశానికి అనుమతించే ముందు ఈ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించే అవకాశం ఉంది.

**ఎన్ని రోజులు ఉండవచ్చు?**

సాధారణంగా అర్హత కలిగిన భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్లకు 14 రోజుల వీసా ఆన్ అరైవల్ మంజూరు చేస్తారు. అవసరమైతే వర్తించే ఇమ్మిగ్రేషన్ నిబంధనలు, రుసుములకు లోబడి ఈ వీసాను మరో 14 రోజుల పాటు ఒకసారి పొడిగించుకోవచ్చు. వీసా కేటగిరీలు, సర్వీస్ ఫీజులు మారే అవకాశం ఉన్నందున ప్రయాణికులు బయలుదేరే ముందు యూఏఈ ఇమ్మిగ్రేషన్ అధికారులతో గానీ, తమ ఎయిర్‌లైన్‌తో గానీ తాజా నిబంధనలు మరియు ఛార్జీలను నిర్ధారించుకోవడం మంచిది.

*** విదేశాల్లో నివసించే అందరికీ వర్తిస్తుందా?**

కేవలం భారతదేశం వెలుపల నివసించడం మాత్రమే ఈ వీసాకు అర్హత కాదు. ప్రయాణికుడు తప్పనిసరిగా పైన పేర్కొన్న అర్హత గల దేశాలలో ఒకదాని నుండి వ్యాలిడ్ వీసా లేదా రెసిడెన్స్ పర్మిట్‌ను కలిగి ఉండాలి. ఈ జాబితాలో లేని దేశాలలో నివసించే భారతీయులు, ప్రయాణానికి ముందే యూఏఈ వీసా కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విస్తరణ వల్ల కెనడా, ఆస్ట్రేలియాలలో ఉన్న అనేక మంది భారతీయ ప్రయాణికులకు వీసా ఆన్ అరైవల్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

# అనారోగ్యంతో మృతి చెందిన శ్వేతకు ఎమ్మెల్యే గండ్ర నివాళి




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గోపాలపురం గ్రామానికి చెందిన తీర్థాల శ్వేత అనారోగ్యంతో మృతి చెందడంతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు బుధవారం ఆమె నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. కుటుంబానికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని శ్వేతకు నివాళులర్పించారు.

# విద్యార్థులపై లాఠీచార్జ్ దారుణం

* **మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఈ ఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం కల్పించిందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం సమంజసం కాదన్నారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, పార్లమెంట్ లో విద్యార్థుల సమస్యలు, నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర చర్చ నిర్వహించాలని కోరారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఢిల్లీలో విద్యార్థుల ఆందోళన సందర్భంగా జరిగిన ఘటనలపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలని, నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం అందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పారదర్శక పరీక్షా విధానాన్ని అమలు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కోరారు.

# దాశరథి ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి

* **జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. హాఫిజ్ ఖాన్**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : ప్రముఖ తెలుగు కవి, గేయకారుడు దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా. హాఫిజ్ ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డా. హాఫిజ్ ఖాన్ మాట్లాడుతూ దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహాకవి అని అన్నారు. "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అంటూ తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడని కొనియాడారు. యువత దాశరథి రచనలను చదివి ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. బాలమ్మ, కవి యాదగిరి రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాజేష్ గ్రంథాలయ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# లక్ష్మారెడ్డి పై రాష్ట్ర బిజెపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

* **బిజెపి పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్ బాబు**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ సంస్థ గత నిర్మాణం జరి గినప్పుడే అసెంబ్లీ కన్వీనర్ పదవులు రద్దు అయినాయని,అయినా నేనే అసెంబ్లీ కన్వీనర్ అని చలామణి అవుతున్న లక్ష్మారెడ్డి పై రాష్ట్ర బిజెపి పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ బిజెపి పట్టణ అధ్యక్షులు భత్తుల శంకర్ బాబు డిమాండ్ చేశారు. హుస్నాబాద్ పట్టణంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో పార్టీ సంస్థ గత నిర్మాణం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుందని దాంట్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని బూత్ కమిటీలను, మండల జిల్లా, అసెంబ్లీ కన్వీనర్ లను అన్ని రద్దు చేసి కొత్త కమిటీలను ఏర్పాటు చేసిందని కానీ హుస్నాబాద్ నియోజకవర్గంలో పార్టీలో లక్ష్మారెడ్డి గ్రూపులను తయారు చేసి కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడని పార్టీ పేరు చెప్పుకొని పబ్బం గడుపుతున్నాడని ఇలాంటి వారిని వెంటనే పార్టీ నుంచి బహిష్కరించి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీ ని అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా : మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా వద్ద రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా శాంతియుతంగా నిరసన చేస్తున్న కాంగ్రెస్ నాయకులను కార్యకర్తలను పోలీసులు బుధవారం అరెస్టు చేసి, పట్టణ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలిపారు. భారత దేశంలో బిజెపి ప్రభుత్వం యువకులకు విద్యార్థులను మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో ఈ దేశాన్ని కాపాడడం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఈ దేశ ప్రజలు కోరుకుంటున్నారని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్మన్ కానుగు రాధిక మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం మహిళలను, యువకులను, మోసం చేస్తుందని వీరంతా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుంటే దానికి మద్దతుగా రాహుల్ గాంధీ బయలుదేరితే అక్రమ అరెస్టు చేయడం మూర్ఖత్వమని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ దేశ రాజధాని జంతర్మంతర్లో నీట్ పరీక్ష పేపర్ పై జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ధర్నా చేస్తున్న వారిని మద్దతుగా బయలుదేరిన రాహుల్ గాంధీని అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ, కేంద్ర ప్రభుత్వం అసమర్థ పాలనకు ఇది నిదర్శనం అని తెలిపారు.కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నీట్ పరీక్ష పేపర్లను లీక్ చేసి బజారులో పల్లి బటాని అమ్ముకునే దుకాణాలలో కనిపించడం సిగ్గుచేటని ఇది విద్యార్థులను మోసం చేయడమై, భవిష్యత్తు నాశనం చేయడమేనని గుర్తు చేశారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మహిపాల్ రెడ్డి, మెదక్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగాధర్,రామాయంపేట మున్సిపల్ చైర్మన్ బెజవాడ లావణ్య, మెదక్,రామయంపేట మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, బొజ్జ పవన్,బుడ్డ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

* **యూత్ కాంగ్రెస్ ఆద్వర్యంలో చాత్రోంకా గూంజ్ విద్యార్థి గర్జన కార్యక్రమం**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: నరేంద్ర మోడీ ప్రభుత్వం పేపర్ లీకేజిల ప్రభుత్వంగా మారిందని, అసమర్ధ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఏపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ అలి అన్నారు. నీట్ పరిక్ష పత్రాల లీకేజికి వ్యతిరేకంగా డిల్లిలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్న పార్లమెంటు లో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ని అక్రమంగా అరెస్టు చేయడం, విద్యార్దులపై పోలీసులు లాటి జార్జి, టియర్ గ్యాస్ ప్రయోగం చేయడానికి వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమతా నాగిరెడ్డి ఆద్వర్యంలో నిర్వహించిన చాత్రోంకా గూంజ్ విద్యార్ది గర్జన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజి చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నీట్ పరిక్ష ప్రతి సంవత్సరం లీకేజి అవుతుందని, విద్యార్దుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అసమర్ధ విధానాల మూలంగా 25 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. 152 సార్లు ప్రశ్నా పత్రాల లీకేజి జరిగిందని, పరిక్ష పత్రాలను ముప్పై లక్షలకు అమ్ముకోవడంతో కష్టపడి చదివే మెరిట్ కల విద్యార్దులకు నష్టం జరుగుతుందని అన్నారు. యూత్ కాంగ్రెస్ కు మద్దతుగా విద్యార్ధి లోకం కదిలి రావాలని అన్నారు. ఈ సమావేశంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్ డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అద్యక్షులు ఎలిమినేటి అభినయ్, జావద్ బేగ్, బొడ్డు సాయి తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే: ఎమ్మెల్యే జీఎస్సార్




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఢిల్లీలో జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడేనని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రాహుల్‌గాంధీపై దాడిని నిరసిస్తూ బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కరుణాకర్‌తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రశ్నపత్రాల లీకేజీలు, నిరుద్యోగం, ఉద్యోగ నియామకాల్లో అవకతవకలపై ప్రధానమంత్రిని ప్రశ్నించేందుకు కాంగ్రెస్‌పార్టీ నిర్వహించిన శాంతియుత ర్యాలీని అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును కాలరాస్తూ ప్రతిపక్ష నేతపై భౌతిక దాడికి పాల్పడటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, సీర్ కోఆర్డినేటర్ హుస్సేన్, భూపాలపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# యువకుడి ప్రాణాలను కాపాడిన మహబూబాబాద్ రూరల్ పోలీసులు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా పోలీసు శాఖలో నైట్ అలర్టింగ్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తున్న మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి బుధవారం తెల్లవారుజామున రెండున్నర గంటలకు డీజీ కంట్రోల్ రూమ్ నుండి ఓ అత్యవసర సమాచారం అందింది.మహబూబాబాద్ రైల్వే ట్రాక్‌పై ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో, సీఐ అంజలి వెంటనే వైర్‌లెస్ సెట్ ద్వారా పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు.తక్షణమే ఎస్సై సుదర్శన్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టారు. షేక్ వసీమ్ ట్రాక్‌పై పడుకుని ఉండడంతో మొదట అతడు ఎవరికీ కనిపించలేదు. ఇదే సమయంలో మణుగూరు ఎక్స్‌ప్రెస్ వేగంగా సమీపిస్తున్న పరిస్థితిలో, పోలీసులు అత్యంత అప్రమత్తంగా వెతుకుతూ చివరకు యువకుడిని గుర్తించారు.రైలు అత్యంత సమీపానికి చేరుకున్న క్షణాల్లోనే చాకచక్యంగా అతడిని పట్టుకుని రైల్వే పట్టాలపై నుంచి సురక్షితంగా బయటకు తీసి ప్రాణాలను కాపాడారు.రక్షించబడిన యువకుడిని షేక్ వసీమ్ (26), తండ్రి అబ్బాస్, నివాసం ఇల్లందుగా గుర్తించారు. అనంతరం అతడిని మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అంజలి మాట్లాడుతూ సమయానికి అందిన సమాచారంపై వెంటనే స్పందించి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడిని క్షేమంగా రక్షించడం పోలీసు శాఖ సేవా తత్పరతకు నిదర్శనమని పేర్కొన్నారు.ఈ ఘటనలో మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి, ఎస్సై సుదర్శన్, బ్లూ కోల్ట్స్ సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది చూపిన సమయస్ఫూర్తి, ధైర్యసాహసాలు, సేవా తత్పరత ఒక నిండు ప్రాణాన్ని కాపాడి పోలీసు శాఖపై ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంచాయని జిల్లా ఎస్పీ డా. శబరీష్, అభినందించారు.

# దేశ రాజధానిలో విద్యార్థులపై లాఠీచార్జి అమానుష చర్య

* **తెలంగాణ గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గూగులోత్ కిషన్ నాయక్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు దళిత, గిరిజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీక్ బాధ్యులను,కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ నిరసన ధర్నా చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కిషన్ నాయక్ మాట్లాడుతూ కష్టపడి చదువుకున్న విద్యార్థులు అనేక సార్లు నీట్ పరీక్ష పేపర్లు లీక్ కావడం వలన మానసిక వేదనకు గురై సుమారు 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. నీట్ పేపర్ బాధ్యులైన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి. కాక్రోచ్ జనతా పార్టీ సారథ్యంలో నిరుద్యోగులు, విద్యార్థులు లక్షలాదిమంది తమ న్యాయమైన కోరికను శాంతియుతంగా పోరాటం చూస్తూ ఉంటే జంతర్ మంతర్ వద్ద పోలీసులు అమానుషంగా లాఠీచార్జ్,టియర్ గ్యాస్ ప్రయోగించి విద్యార్థుల పైన కనీసం బాలికలు అని చూడకుండా ఇష్టం వచ్చినట్లు కొట్టడం, రక్తం వచ్చేలా కొట్టడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే. ఇదా దేశభక్తి ఒకవైపు బేటి బచావో, బేటి పడావో అని చెప్తూ న్యాయం కోరుతున్న ఆడపిల్లలను అని చూడకుండా రక్తం కారేలా కొట్టడం అమానుష చర్య అన్నారు. ఇది రాజ్యాంగా హక్కులను కాలరాయడమే అవుతుందన్నారు. పాలకవర్గాలు అణచివేతను లాఠీలతో ప్రజల గొంతులు నొక్కాలని భావిస్తే అది పాలకవర్గాల భ్రమే అవుతుందన్నారు. జంతర్ మంతర్ వద్ద లక్షలాది మంది నిరుద్యోగులు విద్యార్థులు పోరాటం చేస్తున్న ఆ పోరాటమే గుర్తించి కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని తొలగించి విద్యార్థులకు న్యాయం చేకూర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోలేపాక వెంకన్న డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు,బెజ్జం ఐలేష్ మాల మహానాడు రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు,పడిశాల వెంకన్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు,చేపూరి గణేష్ యాదవ సంఘం జిల్లా నాయకులు,తేజావత్ వినయ్ ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు,మహంకాళి ఉపేందర్ లెక్చరర్,సతీష్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# సర్... వేగవంతం చేయండి

: **గిర్ధావర్ నరసింహారావు**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ ప్రక్రియను వేగవంతం చేయాలని గిర్ధావర్ నరసింహారావు అన్నారు. ఆయన చుంచుపల్లి మండల విద్యానగర్ కాలనీ పంచాయతీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన సర్ ఫారం డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నుండి స్వీకరించిన ఫారాలను వెంటనే ఆన్ లైన్ చేయాలని బిఎల్ఓ లకు సూచిస్తూ, సర్ ప్రక్రియను ఎన్నికల కమిషన్ ఆగస్టు 3 వరకు పొడిగించిందని, ఓటర్లు పూర్తిచేసిన ఎన్యుమరేషన్ ఫారాలను వెంటనే బి ఎల్ ఓ లకు అందజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ మాలోత్ శంకర్, జిపిఓ బాలాజీ, విద్యానగర్ పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, బి ఎల్ వో లు నాగరాణి, బోస్ పాల్గొన్నారు.

# 24న తెలంగాణలో విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఈనెల 24న విద్యాసంస్థల బంద్‌కు పలు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించడంతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ సంఘాలు డిమాండ్ చేశాయి. దిల్లీలో యువతపై జరిగిన పోలీసుల లాఠీఛార్జ్‌ను ఆయా సంఘాల నేతలు ఖండించారు. బంద్‌కు అన్ని విద్యాసంస్థలు సహకరించి విజయవంతం చేయాలని ఎన్ఎస్‌యూఐ తెలంగాణ అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామి కోరారు. విద్యార్థుల కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతు తెలపాలన్నారు.

# మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

*** జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : మహిళలు డ్రోన్ సాంకేతికతను అందిపుచ్చుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగి విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా మారడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. బుధవారం టిటిడిసి లో డీఆర్డీఏ-సెర్ప్ ఆధ్వర్యంలో, సీఎస్ఆర్ నిధులతో మీరాయి శిక్షణ సంస్థ నిర్వహిస్తున్న నీలగిరి జిల్లా మహిళా కిసాన్ డ్రోన్ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా డ్రోన్ ఆపరేటర్ శిక్షణ పొందుతున్న 50 మంది మహిళలతో ముఖాముఖి మాట్లాడారు. మహిళలకు 10 రోజుల పాటు ఇస్తున్న డ్రోన్ శిక్షణను పూర్తిగా సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ నైపుణ్యం సాధించాలని కోరారు. ఈ శిక్షణతో వ్యవసాయ రంగంలోనే కాకుండా, వివిధ రంగాలలో ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చని తెలిపారు. డ్రోన్ సేవల ద్వారా ప్రతి ఎకరానికి సుమారు రూ.400 చొప్పున సేవా రుసుము లభించే అవకాశం ఉందని, జిల్లా వ్యాప్తంగా ఒకే విధమైన రేటు విధానాన్ని అమలు చేసుకుని రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. తమకు వచ్చే ఆదాయాన్ని అంచనా వేసుకుని అవసరమైన మేరకు మాత్రమే రుణాలు తీసుకోవాలని, మిగిలిన ఆదాయాన్ని పొదుపు చేసుకుంటూ ఆర్థికంగా బలపడాలని చెప్పారు. మహిళలు ఉద్యోగాల కై ఎదురుచూడకుండా తామే డ్రోన్ యూనిట్ల యజమానులుగా మారాలని, ప్రతి గ్రూపు వద్ద ఒక డ్రోన్ యూనిట్ ఉండేలా ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. డ్రోన్ ఆపరేట్ చేయడం మాత్రమే కాకుండా డ్రోన్ మరమ్మతు, నిర్వహణలో కూడా




పూర్తి అవగాహన పెంచుకుని మెకానిక్‌లుగా కూడా నైపుణ్యం సంపాదించాలని అన్నారు. శిక్షణ పొందుతున్న ఆపరేటర్లు విజయలక్ష్మి మాట్లాడుతూ సొంతకాళ్ళపై నిలబడి ఎదగడానికి, అభివృద్ధిలోకి రావడానికి సహాయ సహకారాలు అందిస్తున్న ప్రభుత్వాన్ని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, మీరాయి సీఈవో విజయ్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సతీష్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, ఏ పిడి శ్రవణ్ కుమార్, శ్రీలేఖ, శ్రీనిధి ఆర్ఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దాశరధి కృష్ణమాచార్య జయంతి ఉత్సవాలు



ప్రజాస్ఫూర్తి, జన్నారం : ప్రభుత్వ జూనియర్ కళాశాల జన్నారం నందు బుధవారం దాశరధి కృష్ణమాచార్యులు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజిత్ కుమార్ మాట్లాడుతూ దాశరధి కృష్ణమాచార్యులు నా తెలంగాణ కోటి రత్నాల వీణ అనే నినాదంతో నిజాం పాలన కాలంలో నిజాం నవాబులను ఎదిరించిన గొప్ప వీరుడు, ఆనాడు ప్రజల లోపల చైతన్యం తీసుకురావడానికి జైలు జీవితాన్ని కూడా అనుభవించిన సాహిత్య కళాకారుడు ఎన్నో సినిమా పాటలు కూడా రాశాడని, దాశరధి కృష్ణమాచార్యులు ఎంతో గొప్ప అభ్యుదయ వాది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం జి బాబురావు, ఎం.సాయికుమార్, ఎం.రవీందర్, వై.నాగేశ్వరరావు, సీహెచ్.మోహన్, సిహెచ్.శశికళ, దేవేందర్, స్వరూప, కర్ణాకర్, ఎం.కుమారస్వామి, ఎం.శివరాం తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ కుట్రపూరిత వైఖరికి నిరసనగా బిజెపి మహా ధర్నా



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ముట్టడికి కాంగ్రెస్ ఇండియా కూటమి కుట్రపూరిత వైఖరిపై హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో బీజేపీ మహాధర్నా నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మరియు ఇండియా కూటమి అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరికి నిరసనగా మహాధర్నా కార్యక్రమం జరిగింది పోలీసులు బిజెపి శ్రేణులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అనంతరం బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి చేసిన ప్రయత్నం అత్యంత ఖండనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్, వివిధ మండలాల అధ్యక్షులు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంటల మార్పిడితో రైతులు ఆదాయం పెంచుకోవాలి

**– జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎల్-నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నష్టాలను నివారించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు సూచించారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి దీపక్‌తో కలిసి నిర్వహించిన రైతుల అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ బోరు నీటిపై ఆధారపడి వరి సాగు చేయడం వల్ల నీటి కొరత ఏర్పడి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ఆయిల్ పామ్, అపరాలు (పప్పుధాన్యాలు), కూరగాయలు, మొక్కజొన్న, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఆయిల్‌ఫామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయం లభిస్తుందని, అపరాలు, మొక్కజొన్న, జొన్న వంటి పంటలు తక్కువ నీటితో సాగవడంతో పాటు మార్కెట్‌లో మంచి డిమాండ్ కలిగి ఉన్నాయని తెలిపారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ.. అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి

*** మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడాన్ని భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ తీవ్రంగా ఖండించారు. ప్రజల సమస్యలను ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను అరెస్టులతో భయపెట్టాలని చూడడం ప్రజాస్వామ్య స్ఫూర్తిపై ప్రత్యక్ష దాడి అని ఆయన మండిపడ్డారు. 2026 మే నెలలో జరిగిన వైద్య ప్రవేశ పరీక్ష (నీట్) పేపర్ లీక్ అవడంతో 22 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందని, 12 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని మండిపడ్డారు. నీట్ పేపర్ తోపాటు అనేక పోటీ పరీక్షలో జరుగుతున్న లీక్ వల్ల విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, అలాంటి విద్యార్థులకు అండగా నిలిచేందుకు వచ్చిన రాహుల్ గాంధీ పై దాడి అప్రజాస్వామికం అని మండిపడ్డారు ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి అరెస్టులను ఆయుధంగా మార్చుకోవడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు.

## 22 రోస్టరు విధానాన్ని సవరించి ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి

*** మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి**



నల్గొండ, ప్రజాస్ఫూర్తి: ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల సామాజిక వర్గానికి జరుగుతున్న సుదీర్ఘకాలపు తీవ్ర అన్యాయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, 22 రోస్టర్ విధానం వల్ల మాల సామాజికవర్గ విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు జరుగుతున్న ఘోర అన్యాయాని తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేస్తూ మాల సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం మాలలు నిరసన దీక్ష చేపట్టారు. దీక్షను ఉద్దేశించి జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం ఎస్సీ వర్గీకరణ ఎంతమాత్రం చెల్లదన్నారు. రాజ్యాంగ సూత్రాలను పక్కనబెట్టి దళితులను విడదీసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే మాల సమాజం ఊరుకోదని భారత ప్రభుత్వం తక్షణమే ఈ విషయాన్ని గుర్తించి రాజ్యాంగ విరుద్ధమైన వర్గీకరణను పూర్తిగా కొట్టివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మల మహానాడు నల్గొండ జిల్లా అధ్యక్షుడు బొప్పని నగేష్, మల మహానాడు గౌరవ అధ్యక్షులు ఏ కుల రాజారావు, మల మహానాడు జిల్లా కార్యదర్శి వెన్నెమళ్ళ అనిల మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతపల్లి లింగమయ్య, మల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేరా బాలకిషన్, హంస అధ్యక్షులు నామా సైదులు, హంస నాయకులు రాహుల్, మల మహానాడు (ట్రైబల్) కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మాదుగుల శ్రీనివాస్, చిలుకూరి అభినవ్, వేణు బలరామ్, కట్టమురళి బాలకృష్ణ, బొగారి అనిల్, ఏకుల సురేష్, బోయిల్ల చంద్రమౌళి, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని వివిధ మండలాల మాల మహానాడు నాయకులు, జేఏసీ ప్రతినిధులు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు మాల సామాజికవర్గ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు మళ్లాలి

*** రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**




ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : త్రాగునీటిని కాపాడుకుంటూ, రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కలిసి వి. వెంకటాయ పాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే కార్యాచరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ సూచించిన విధంగా రైతులు ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు వంటి తక్కువ నీటిఅవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. ఖమ్మం జిల్లాకు కృష్ణా జలాలు మాత్రమే సరిపోవని, దశాబ్దాలుగా గోదావరి జలాలను తీసుకురావాలనే ప్రజల ఆకాంక్ష ఉందన్నారు. సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన రాజీవ్ కాలువ వల్ల రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి ఏర్పడిందని, ఇది సాగునీటి రంగంలో విశేష విజయమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత చాలా తక్కువగా ఉందని, రాబోయే నెలల్లో వర్షాలు కురవకపోతే త్రాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశముందని అన్నారు. అనంతరం మంత్రి ఖమ్మం నగరంలోని 3, 4, 5 డివిజన్లలో యూఐడీఎఫ్ నిధులతో రూ.175 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సిఇ ఇరిగేషన్ శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డిపిఓ రాంబాబు, వివి పాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టు, నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా కాంగ్రెస్ ఆందోళనలు



జనగామ, ప్రజాస్ఫూర్తి : ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ఎంపీల అరెస్టును, నీట్ పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. గాంధీ విగ్రహం వద్ద రాస్తారోకో, భారీ ధర్నా నిర్వహించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహన ప్రయత్నం చేశారు. నిరసనలో పాల్గొన్న పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన రాస్తారోకోలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీలో ప్రధాని నివాసం ముందు శాంతియుతంగా జరుగుతున్న ధర్నాలో రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడమే కాకుండా ఆయనపై దాడి జరిగిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం టీపీసీసీ పిలుపు మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. తదనంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్ జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెడ శ్రీనివాస్, కొమురవెల్లి - కొడవటూరు దేవస్థానాల చైర్మన్లు గంగం నరసింహారెడ్డి, ఇదులకంటి వెంకటరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్, కిసాన్ కాంగ్రెస్, సేవాదళ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, జిల్లా, మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువతను మై భారత్ పోర్టల్‌లో నమోదు చేయాలి

*** అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణు గోపాల్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర ప్రభుత్వం యువత కోసం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా యువజన కార్యక్రమాల సలహా సంఘం సమావేశంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రారంభించిన మై భారత్ పోర్టల్ ద్వారా యువతకు వివిధ రంగాల్లో అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 9 వేల మంది యువత ఈ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని, ప్రత్యేక నమోదు కార్యక్రమం ద్వారా ఈ సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ వెంకట్రామ్ బాబు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జిల్లా షెడ్యూల్డ్ తరగతుల అభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాధికారి వసంత, జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామ రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కామేశ్వర రావు, అడిషనల్ డిఎంహెచ్ఓ., సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావం పై సమీక్ష సమావేశం

*** ఏర్పాట్లను పరిశీలించిన సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ ఐఓసిలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ 7 మండలాలకు సంబంధించి వానకాలం 2026 ఎల్ నీ నో ప్రభావం ఎదుర్కొనేందుకు ఆయా శాఖల అధికారులతో నిర్వహించనున్న సమీక్ష సమావేశ ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హుస్నాబాద్ నియోజవర్గ ఎల్ నీ నో ప్రభావం ఎదుర్కొనేందుకు నిర్వహించే సన్నాహక సమావేశానికి 3 జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యానవన, గ్రామపంచాయతీ, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, విద్యుత్ తదితరులు శాఖల అధికారులందరికీ వస్తారని, వారి యొక్క యాక్షన్ ప్లాన్ తెలపడం కోసం ప్రొజెక్టర్ ఏర్పాటు చెయ్యాలని, జిల్లాల వారిగా అధికారులకు సిట్టింగ్, 3 జిల్లాలు 7 మండలాలు కావున వాటర్ సౌకర్యం కల్పించాలని అలాగే ఉదయం నుండి సాయంత్రం దాకా కొనసాగుతుందని మధ్యాహ్నం లంచ్ ఏర్పాటు సైతం చెయ్యాలని, ఈ కార్యక్రమం ఫర్నిచర్, మైక్ సెట్టింగ్, నిరంతర విద్యుత్, టీ స్నాక్స్, డ్రింకింగ్ వాటర్, మధ్యాహ్న భోజనం ప్రతిదీ ఎక్కడ కూడా లోటు కాకుండా చూసుకోవాలనీ ఆర్డీఓ రామ్మూర్తి నీ ఆదేశించారు.

## ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన సదస్సు

*** మండల వ్యవసాయ అధికారి అంజనీ దేవి**

వలిగొండ, ప్రజాస్ఫూర్తి : మండల పరిధిలోని వర్కట్ పల్లి గ్రామలో ప్రస్తుత ఎలినో వాతావరణ పరిస్థితుల అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు మండల వ్యవసాయ అధికారి అంజనీ దేవి అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఎలినో ప్రభావం ఆగస్టు మరియు సెప్టెంబర్ మాసంలో తీవ్రంగా ఉంటాయని అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉన్నందున మరియు వర్షాలు కూడా పడే అవకాశం లేనందున భూగర్భ జలాలు అడుగంటే అవకాశం ఉన్నందున వరీ వేసే రైతులు ఇతర ఆరు తడి పంటలు వేసుకోవాలని సూచించడం జరిగింది. ఒక ఎకరా వరి పండించే నీటితో ఇతర పంటలు 5నుండి 6 ఎకరాలు పండించవచ్చని రైతులకు తెలిపారు కాబట్టి రైతులు వరి వేసి నష్టపోవద్దని సూచించారు రైతులు కందులు పేసర్లు, కూరగాయలు, ఆయిల్ ఫామ్ సాగుకు మొగ్గు చూపాలని వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమణమ్మ జనార్ధన్ రెడ్డి ఏఈవో సౌమ్య శ్రీ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా లక్ష్మీనారాయణ ఆరాధన

* **వెంకటేశ్వర స్వామి తృతీయ పుష్కర వేడుకల్లో భక్తుల ఆధ్యాత్మిక సందడి**

జనగామ, ప్రజాస్ఫూర్తి : కష్టాల నివారకుడైన శ్రీ లక్ష్మీనారాయణ స్వామిని భక్తి శ్రద్ధలతో ఆరాధిస్తే ఆనందం, ఐశ్వర్యం, ఋణ విముక్తి లభిస్తాయని శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి పేర్కొన్నారు. బాణాపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య సిద్ధాంతి ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్న తృతీయ పుష్కర మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం ఉదయం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈ ఆరాధన కార్యక్రమాన్ని చిన్న జీయర్ స్వామి స్వయంగా నిర్వహించి భక్తులతో పూజలు చేయించారు. సుమారు 150 మందికి పైగా దంపతులు పాల్గొని లక్ష్మీనారాయణ స్వామి అనుగ్రహాన్ని పొందారు. ఈ సందర్భంగా చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ, లక్ష్మీనారాయణ స్వామి ఆరాధన వల్ల ప్రత్యేకించి ఋణ విముక్తి కలిగి, ఉద్యోగం, వ్యాపారం తదితర రంగాల్లో ఆశించిన ఫలితాలు సిద్ధిస్తాయని తెలిపారు. అనంతరం స్వయంగా లక్ష్మీనారాయణ స్వామి ప్రతిమలను భక్తులకు అందజేసి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి, మంగళాశాసనాలతో దంపతులందరినీ ఆశీర్వదించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ఈ



ఆధ్యాత్మిక కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.

# కాంగ్రెస్ నేతల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

* **కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన**



ప్రజాస్ఫూర్తి,కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ లో ప్రధాని మోదీ నివాసం వద్ద నిరసన తెలిపిన రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గ ప్రియాంక గాంధీ అక్రమ అరెస్టును ఖండించడంతోపాటు, హైదరాబాదులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తోపాటు క్యాబినెట్ మంత్రులను అరెస్టు చేయటం పట్ల డిసిసి అధ్యక్షురాలు డిసిసి తోట దేవి ప్రసన్న, రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష పత్రాల లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారమైందని వారు ఆవేదన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగిన విద్యార్థులు, యువత పట్ల పోలీసులు విచక్షణా రహితంగా వ్యవహరిస్తూ లాఠీఛార్జ్ చేయటం తోపాటు అక్రమ అరెస్టు చేయటం దుర్మార్గమని దేశంలో నియంత పాలన సాగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగ సీతారాములు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ, కొత్వాల శ్రీనివాస్ రావు, మండే వీర హనుమంతరావు, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, జిల్లా కమిటీ సభ్యులు, వివిధ కార్పొరేటర్స్ పాల్గొన్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నేత నారాయణ రెడ్డి కి నివాళ్ళులర్పించిన కొలను హన్మంత్ రెడ్డి



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, భగత్ సింగ్ నగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణ రెడ్డి బుధవారం అకాల మరణం చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ నగర్‌లోని నారాయణ రెడ్డి నివాసానికి కొలన్ హన్మంత్ రెడ్డి వెళ్ళి ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. పార్టీ బలోపేతానికి నారాయణ రెడ్డి చేసిన సేవలను ఆయన గుర్తు చేశారు. ఆయన అకాల మరణం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. అనంతరం నారాయణ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, భగత్ సింగ్ నగర్ కాలనీ నివాసితులు పాల్గొని నారాయణ రెడ్డికి నివాళులు అర్పించారు.

# కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటాం

* **కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ బీఆర్ఎస్ నాయకులు ఎల్ఐసీ రాజు, చిప్ప రమేష్ అనారోగ్యంతో ఉన్నారని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ వెంటనే వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారికీ వారి కుటుంబానికి ఎల్లపుడు మేము అండగా ఉంటామన్నారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మహమ్మద్ రఫీ, సీనియర్ నాయకులు సాంబయ్య, ఉప్పలయ్య, సామ్రాట్, లక్ష్మన్, చందు, శ్రీధర్, ప్రభాకర్, జహంగీర్, బాలు నేత, యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు పటోళ్ల నాగిరెడ్డి అన్నారు. కూకట్‌పల్లి డిపోలో ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో పటోళ్ల నాగిరెడ్డి చేత జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఒడిశాల అబ్రహం, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కర్, జయ, ఆఫీస్ ఖాన్, పాండు, డిపో బాధ్యులు అక్బర్, శివ, అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పటోళ్ల నాగిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ మనుగడకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని, కార్మికులంతా కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంఘమైన ఎస్‌డబ్ల్యూయూ-ఐఎన్‌టీయూసీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ విలీన ప్రక్రియ పూర్తికాకముందే ఎన్నికలు నిర్వహించడం ద్వారా కార్మికులను విలీనానికి దూరం చేశారని జేఏసీ నాయకత్వాన్ని విమర్శించారు.

# రాహుల్ గాంధీ అప్రజాస్వామ్య అరెస్టుకు నిరసనగా చలో లోక్ భవన్' కార్యక్రమం

వలిగొండ, ప్రజాస్ఫూర్తి : లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అప్రజాస్వామ్య అరెస్టుకు నిరసనగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని లోక్ భవన్ వద్ద నిర్వహించిన 'చలో లోక్ భవన్' కార్యక్రమంలో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలు, ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని తీవ్రంగా ఖండిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. అనంతరం పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నిరసన కార్యక్రమంలో పాల్గొని పోలీసులు అదుపులోకి తీసుకున్న మంత్రి వివేక్ వెంకటస్వామి ఎమ్మెల్యే మందుల సామెల్ ని కలిసి సంఘీభావం




తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు పాశం సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు, వలిగొండ సింగిల్విండో చైర్మన్ గరిసె రవి, నాయకులు చెరుకు శివయ్య, పలుసం సతీష్ గౌడ్ చిలుకూరు సత్తిరెడ్డి, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ పతాక స్వీకరణ దినోత్సవం

ప్రజాస్ఫూర్తి, జన్నారం : జాతీయ పతాక స్వీకరణ దినోత్సవం సందర్భంగా జన్నారంలోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ జన్నారం మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ దండేపల్లి సంయుక్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ కృష్ణవేణి పాఠశాల విద్యార్థుల చేత 100 మీటర్ల జాతీయ జెండా తో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత జాతీయ పతాక చరిత్ర, ప్రాముఖ్యత, గౌరవం గురించి విద్యార్థులకు వివరించారు. 1947 జూలై 22న రాజ్యాంగ సభ భారత త్రివర్ణ పతాకాన్ని జాతీయ పతాకంగా అధికారికంగా ఆమోదించిన చారిత్రక రోజుని పురస్కరించుకుని ప్రతి భారతీయుడు జాతీయ పతాకాన్ని గౌరవించడం తన బాధ్యత అని తెలియజేశారు. అలాగే పతాకాన్ని సక్రమంగా ఉపయోగించడం,



దాని గౌరవాన్ని కాపాడడం ప్రతి పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరికి జాతీయ జెండా పట్ల దేశభక్తి, గౌరవ భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ రీజియన్ సెక్రటరీ డా. కస్తూరి సతీష్ కుమార్, జోన్ చైర్‌పర్సన్ లయన్ మాదంశెట్టి మల్లికార్జున్, లయన్స్ క్లబ్ ఆఫ్ జన్నారం ప్రెసిడెంట్ బండారి మారుతి రాజ్, సెక్రెటరీ గోలి రాము, ట్రెజరర్ రామ్ సింగ్, కేబినెట్ సభ్యులు అంజిత్ రావు, అన్నం సత్యనారాయణ లయన్స్ క్లబ్ సభ్యులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్‌లో జులై 21, 22 తేదీల్లో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించనున్న ఎల్లమ్మ కల్యాణం, రథోత్సవం నేపథ్యంలో ఈ రెండు రోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని ప్రకటించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఆటంకం కలగకుండా, అటు వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రెండు రోజుల పాటు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని పోలీసులు సూచించారు. ఆంక్షలు అమలులో ఉండే ప్రాంతాల్లో రద్దీని నివారించేందుకు, ప్రజలు తమ ప్రయాణాలను ముందుగానే



ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేసుకోవాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఆలయ పరిసరాల్లో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, ఆయా మార్గాలను కాకుండా ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని వాహనదారులకు దిశానిర్దేశం చేశారు. సాధ్యమైనంత వరకు ఈ రెండు రోజులు వ్యక్తిగత వాహనాలకు బదులుగా ప్రజా రవాణా సౌకర్యాలను వినియోగించుకోవడం ఉత్తమమని అధికారులు సూచించారు. నిర్ణీత ఆధ్యాత్మిక కార్యక్రమాలు ముగిసిన వెంటనే ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# తెలంగాణలో మరో 48 గంటలు విస్తారంగా వర్షాలు.. వాతావరణ శాఖ హెచ్చరిక

తెలంగాణలో మరో రెండు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నైరుతి రుతుపవన ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం పూర్తిగా మారిపోయిందని తెలిపింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గురువారం కూడా రోజంతా ఆకాశం మేఘావృతంగా ఉండి పలుచోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హైదరాబాద్‌లో బుధవారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, సనత్‌నగర్, కృష్ణానగర్, ఫిలింనగర్, బోరబండ, ఎర్రగడ్డ, అమీర్‌పేట, పంజాగుట్ట, ఎస్ఆర్‌నగర్‌తో పాటు సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్ ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. కుండపోతతో పలు రహదారులు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టాయి. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో తొలగింపు పనులు కొనసాగుతున్నాయి.

# రేషన్ కార్డుదారులకు ఈ కేవైసీ తప్పనిసరి

* **31లోగా పూర్తి చేయకపోతే రేషన్ యూనిట్ తొలగింపు**
* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో జాతీయ ఆహార భద్రతా చట్టం, రాష్ట్ర ఆహార భద్రతా కార్డుల కింద నమోదైన అన్ని రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రేషన్ కార్డులో పేరు నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ప్రామాణీకరణ (ఈ కేవైసీ) పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం లబ్ధిదారులు తమ సమీపంలోని చౌక ధరల దుకాణం (రేషన్ షాప్)ను సందర్శించి, ఎలాంటి రుసుము చెల్లించకుండా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చన్నారు. ఈ కేవైసీ కోసం అసలు రేషన్ కార్డు, ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాలని, రేషన్ కార్డులోని ప్రతి సభ్యుడు వ్యక్తిగతంగా హాజరై ఈపాస్ యంత్రంపై వేలిముద్రలు నమోదు చేయాల్సి ఉంటుందని వివరించారు. జూలై 31, 2026లోపు ఈకేవైసీ పూర్తి చేయని లబ్ధిదారుల రేషన్ యూనిట్‌ను తొలగించడం తో పాటు, వారికి ఉచిత లేదా రాయితీ ధరలపై అందించే రేషన్ సరఫరాను నిలిపివేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి నెల అందించే ఉచిత, రాయితీ రేషన్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండేందుకు గడువుముగిసే లోపు సమీప రేషన్ దుకాణాన్ని సందర్శించి ఈకేవైసీ పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం లబ్ధిదారులందరికీ విజ్ఞప్తి చేసింది.

# ట్రాఫిక్ నిబంధనలు బాధ్యతగా పాటించాలి

- **చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరి బాధ్యతగా పాటించాలని చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ అన్నారు. చౌటుప్పల్ లోని ఎం జె పి టి స్కూల్‌లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటుబెల్ట్ వినియోగించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్‌ను ఉపయోగించడం, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు గుర్తులను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు, స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేదలకు వరం.. సీఎం సహాయనిధి




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సుక్క రవీందర్ అన్నారు. చౌటుప్పల్ మండలం దండు మల్కాపూర్ గ్రామంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బోయిని స్వరూపకు రూ.56వేలు, జోన్నగంటి జంగయ్య రూ.45వేలు, పేరుమాండ్ల అచ్చమ్మ రూ.35వేల, బుర్ర దేవి రూ.17వేల విలువైన చెక్కులను గ్రామశాఖ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు సుక్క రవీందర్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మీసాల నర్సింహ్మా, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ దేప శ్యాంసుందర్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహ్మద్ గౌస్ ఖాన్, వార్డు సభ్యులు ఈద్దుల ఇంద్రసేన యాదవ్, అత్తపురం సంతోష అంజిరెడ్డి, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు మునుకుంట్ల రాజు గౌడ్, దేవాలయల ధర్మకర్తలు ఈద్దుల బాబు యాదవ్, దౌడి లింగస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పీసరి యాదిరెడ్డి, మల్కాజ్గిరి నరసింహ, దౌడి వెంకటేష్, ఈద్దుల కేశవ్ యాదవ్, బద్దుల నర్సింహ్మా, ముదిగొండ మహేష్, బుర్ర శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం

*** 11 లీటర్ల గుడుంబా స్వాధీనం.. ముగ్గురిపై కేసులు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): నిషేధిత గుడుంబా తయారీ, నిల్వ, విక్రయాలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం పర్లపల్లి గ్రామంలో ఎస్ఐ ముప్పు సురేష్ ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో అక్రమంగా విక్రయిస్తున్న 11 లీటర్ల గుడుంబాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.గ్రామంలో అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టిన పోలీసులు.. కథాల ప్రమీల వద్ద 4 లీటర్లు, దేవులపల్లి సరోజన వద్ద 3 లీటర్లు, జోరుక లలిత వద్ద 4 లీటర్ల గుడుంబాను గుర్తించారు. మొత్తం రూ.4,400 విలువైన గుడుంబాను స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన గుడుంబా తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గుడుంబా అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ప్రజలు గుడుంబాకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని ఎస్ఐ సురేష్ పిలుపునిచ్చారు.

# రాహుల్ గాంధీ పై దాడిని ఖండిస్తూ శాంతియుత నిరసన

*** నల్గొండ డీసీసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత.**



ప్రజాస్ఫూర్తి, నల్గొండ : ఏఐసీసీ పీసీసీ పిలుపుమేరకు లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేసి గాయపరిచిన మోడీ ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా బుధవారం నల్గొండ రామగిరి లో మహాత్మా గాంధీ విగ్రహం ముందు నల్ల రిబ్బన్స్ ధరించి శాంతియుత ధర్నా నిర్వహించారు. నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం గాంధీ విగ్రహం ముందు బైఠాయించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత మాట్లాడుతూ 25 లక్షల మంది విద్యార్థులతో చెలగాటం ఆడుతూ అనేకమంది మరణానికి కారణమైన నీటి ప్రశ్న పత్రాలు లీకేజ్ బాధ్యులపై చర్యలు తీసుకొని అసమర్థ ప్రధాని మోడీ అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేతలు ఓ బిసి సెల్ చైర్మన్ జిల్లపల్లి పరమేష్, ఎస్సీ సెల్ చైర్మన్ బోడ స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు ముంతాజ్ అలీ, సిరాజ్ ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు గోపిశెట్టి రాంబాబు, కుకుడాల బాలకృష్ణ, ఏళ్ల రవీందర్ రెడ్డి, మేకల రాజేందర్ రెడ్డి, చిట్యాల మండల అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య, శాలిగౌరారం మండల అధ్యక్షుడు చింత ధనుంజయ్,మధు ప్రసాద్, పోకల దేవదాస్, కట్టం వెంకన్న, పగిళ్ల రాజు, చర్లపల్లి గౌతమ్, ఎండి ఫిరోజ్ ,గడ్డం దామోదర్,తదితరులు పాల్గొన్నారు.

# ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

*** సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : చుంచుపల్లి మండలం హౌసింగ్ బోర్డ్ నందు గల కొత్తగూడెం సొసైటీ కార్యాలయం నందు సొసైటీలో సభ్యత్వం కలిగి ఇటీవల మరణించిన రైతు బాదావత్ తండా నివాసి బాదావత్ చందా ఇన్సూరెన్స్ చెక్కును నామిని అతని భార్య బాదావత్ పద్మకు ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ లక్ష రూపాయలు చెక్కును సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి రమణారెడ్డి, డైరెక్టర్ రామచంద్రరావు పలువురు రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# పలిమెల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా,(ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందేలా ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు.

# విద్యార్థినుల భద్రతకు షీ టీం అండ




*** షీ టీం ఎస్సై ఫజల్‌ఖాన్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): విద్యార్థినులు తమ వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉంటూ, ఎలాంటి వేధింపులు ఎదురైనా ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని జిల్లా షీ టీం ఎస్సై ఫజల్‌ఖాన్ సూచించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు చిట్యాల మండల కేంద్రంలోని తెలంగాణ స్టేట్ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీలో బుధవారం షీ టీం, భరోసా బృందాల ఆధ్వర్యంలో సంయుక్త అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, మహిళలపై జరిగే వేధింపులు, స్ట్రీట్ హరాస్మెంట్, వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఇతర సున్నితమైన సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, తమ భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని చదువుపై పూర్తి దృష్టి సారించాలని ఎస్సై ఫజల్‌ఖాన్ సూచించారు. తమ చదువు కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించి ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, ఎలాంటి భద్రతా సమస్యలు ఎదురైనా వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రత కోసం షీ టీం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎవరైనా అసభ్యంగా, అనుచితంగా ప్రవర్తించినా లేదా వేధింపులకు పాల్పడినా భయపడకుండా షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడంతో పాటు, నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని, సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు వివరించారు.

# సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా గోరింటాకు వేడుకలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం పైలెట్ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో మహిళల కోసం గోరింటాకు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయబద్ధమైన వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో సేవా సమితి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సందడి చేశారు. కార్యక్రమానికి భూపాలపల్లి ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు ఏనుగు సునీత రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. మహిళల మధ్య ఆత్మీయత, స్నేహభావం, ఐక్యతను పెంపొందించేందుకు సింగరేణి సేవా సమితి నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. మహిళలు కుటుంబానికే పరిమితం కాకుండా సమాజ నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు ఆరోగ్యం, విద్య, సాంస్కృతిక రంగాల్లో సేవా సమితి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ కార్యక్రమాల్లో మహిళలు చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు.అనంతరం మహిళలు ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటూ, సంప్రదాయ వస్త్రధారణలో సందడి చేశారు. వేడుకల్లో భాగంగా గోరింటాకు అందంగా వేసిన మహిళలకు సేవా సమితి అధ్యక్షురాలు ఏనుగు సునీత రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి కృష్ణ, సేవా సమితి కార్యదర్శి రుబినా, ప్రియాంక, అరుణ, ఉమ, మల్లీశ్వరి, సేవా సమితి సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

*** లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షులు లయన్ డాక్టర్. చిల్లా రాజశేఖర్ రెడ్డి.**




జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పారిశ్రామికవేత్త, లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షులు లయన్ డాక్టర్. చిల్లా రాజశేఖర్ రెడ్డి సూచించారు. బుధవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి పంచశీల కాలనీలోని రాజ్యలక్ష్మి ఇండస్ట్రీస్ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి ఆధ్వర్యంలో వై.కిషన్ రావు బాలానగర్ లయన్స్ ఐ హాస్పిటల్,ఆర్. ఎన్.సి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని పలువురు లయన్స్ క్లబ్ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేసే అవకాశం దొరకడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజల్లో ఎంతో మనోధైర్యాన్ని నింపుతాయని అన్నారు. భవిష్యత్తులో కూడా సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తారని తెలిపారు. ఇటువంటి అనుభవజ్ఞులైన వైద్య నిపుణులచే కంటి,సా ధారణ వైద్యపరీక్ష లతోపాటు బిపి, షుగర్, థైరాయిడ్ పరీక్షలను పరిసర ప్రాంతాల వాసులకు,కార్మికులకు సుమారు 450 మందికి పైగా చేశారు. అవసరమయ్యే వారికి కళ్ళ అద్దాలతో పాటు,మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎన్.సి ఆసుపత్రి వైద్యులు డాక్టర్.ఫెబిన అబ్దుల్ ఫరూక్,డాక్టర్.సంతోష్‌కుమార్,లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి కార్యదర్శి లయన్ డి.ఎల్లా సుబ్బారెడ్డి, కోశాధికారి రామకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ సత్యవోలు రాంబాబు,విష్ణువర్ధన్ రెడ్డి, బాలాజీ రామకృష్ణ,డాక్టర్. ఎంఆర్ఎస్.రాజు, ఈశ్వర్ రెడ్డి, వాకిటి రాంరెడ్డి కె.ఎల్.రమణారెడ్డి, ఆర్. ఎన్.సి ఆసుపత్రి సిబ్బంది సయ్యద్ ఫరాజ్,శ్రీను,త్రిష,విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

*** ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన ఆధునిక పరికరాలు, సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతోపాటు డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లిన సిబ్బందిని తిరిగి రప్పించాలని కమిటీ తీర్మానించినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న లోపాలను సరిచేయాలని సూచించారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిని 100 పడకల నుంచి 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఆసుపత్రిలో ప్రసూతి, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, అనస్థీషియా, డెంటల్, రేడియాలజీ, అత్యవసర సేవలు, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్ విభాగాలకు అవసరమైన పరికరాలు, సెంట్రల్ ఆక్సిజన్, బ్లడ్ స్టోరేజ్ రూమ్, సిబ్బంది కొరత తదితర అంశాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనస్థీషియా విభాగంలో ఎనిమిది పోస్టులకు ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారని, వైద్యుల కొరతతో సేవలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యులు తెలిపారు. గైనకాలజీ విభాగంలో ఎనిమిది మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారని వివరించారు. ప్రస్తుతం నెలకు సుమారు 190 ప్రసవాలు జరుగుతున్నాయని తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఆసుపత్రి అంబులెన్స్‌లకు మరమ్మతులు చేయించాలని సూచించారు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎంఆర్ఐ సేవలకు టెక్నీషియన్ నియామకానికి ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో యూడీఐడీ గది ఏర్పాటు చేయాలని, ఆయా విభాగాలకు అవసరమైన పరికరాల కోసం ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా. రాజేంద్రప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. మధుసూదన్, జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, ఆసుపత్రి ఉప పర్యవేక్షకులు డా. వెంకటరత్నం, వివిధ విభాగాల వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

*** రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు. మల్లికార్జున ఖర్గె, కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ, ఇతర ముఖ్య నేతల అక్రమ అరెస్టులు అప్రాజస్వామికమని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ లో బుధవారం మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ ఢిల్లీలో శాంతియుతంగా జంతర్ మంతర్ వద్ద నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడం ఆ ప్రజాస్వామికమని శాంతియుత నిరసనలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు పాల్గొంటే అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ సీనియర్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు మాజీ ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# ఎరువుల పంపిణీలో పారదర్శకత పాటించాలి

*** జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఎరువుల పంపిణీలో పూర్తి పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం 2026 జూలై 15 నుంచి మార్క్‌ఫెడ్ ద్వారా ఇప్పటివరకు అమలులో ఉన్న ఫ్రైట్ ఆన్ లారీ సౌకర్యాన్ని నిలిపివేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో మార్క్‌ఫెడ్ గిడ్డంగులు లేదా రేక్ హెడ్‌ల నుంచి సరఫరా అయ్యే ఎరువులకు సంబంధించిన రవాణా ఛార్జీలను మాత్రమే రైతుల నుంచి నిర్ణయించిన రేట్ల ప్రకారం వసూలు చేయాలని సూచించారు.రవాణా ఛార్జీల వసూళ్లలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రతి లావాదేవీకి తప్పని సరిగా రసీదు ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు.కంపెనీల నుంచి నేరుగా ఎఫ్ఓఎల్ విధానంలో సరఫరా అయ్యే ఎరువులకు ఎలాంటి రవాణా ఛార్జీలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. రైతులు ఈ నిర్ణయాన్ని అర్థం చేసుకుని సహకరించాలని, ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ఛార్జీలను మాత్రమే చెల్లించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు మొత్తాలు చెల్లించవద్దని సూచించారు. ఏవైనా అక్రమ వసూళ్లు జరిగినట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ కోరారు.

# యువత దేశ సేవకు అంకితం కావాలి

*** ఎన్ జి కళాశాల స్నాతకోత్సవంలో ఎం జి యు, వి సి అల్తాఫ్ హుస్సేన్**




ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : యువత దేశ సేవకు పునరంకితం కావాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. బుధవారం స్థానిక ఎం ఎన్ ఆర్ కన్వెషన్ లో జరిగిన నాగార్జున ప్రభుత్వ కళాశాల మొదటి స్నాతకోత్సవం, వ్యవస్థాపక దినోత్సవం, బంగారు పతకాల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ కేవలం రాజకీయ నాయకులు చేసేదే దేశ సేవ కాదని ఎవరి బాధ్యత వారు నెరవేరిస్తే అదే దేశ సేవ అని అన్నారు. విద్యార్థులు నిరంతరం నేర్చుకునే వైఖరి కల్గి ఉండాలని అన్నారు. డిగ్రీతోనే చదువు ఆపకుండా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇంకా పై చదువులు చదవాలని సూచించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ బంగారు పతకాలు పొందిన విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు బంగారు పతకాలు, కన్వకేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ జి ఉపేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. ఉపేందర్, వైస్ ప్రిన్సిపాల్స్ డా. పరంగి రవి కుమార్, డా. అంతటి శ్రీనివాసులు, పరీక్షల నియంత్రణాధికారి డా. డి. మునిస్వామి, అకాడమిక్ కోఆర్డినేటర్ బి. నాగరాజు, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస రాజు, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ డా. రాజారాం, ఎం ఎన్ ఆర్ కన్వెన్షన్ యజమాని మందడి నర్సిరెడ్డి, రామన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. రహత్ ఖానం, తెలుగు శాఖ అధ్యక్షులు డా. వెల్దండి శ్రీధర్, జంతుశాస్త్ర విభాగ అధ్యక్షులు డా. జ్యోత్స్న, స్టాటిస్టికల్ విభాగ అధ్యక్షులు డా. బొజ్జ అనిల్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ సుధాకర్, అధ్యాపకులు డా. అనిల్ అబ్రహం, మల్లేశం, కోటయ్య, వాసుదేవ్, వేణు, బంగారు పతకాల దాతలు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలపై దౌర్జన్యాలకు పాల్పడితే చర్యలు తప్పవు

- మల్కాజ్ గిరి పోలీస్ కమిషనర్ కు ట్రస్మా ఫిర్యాదు
- డబ్బులు డిమాండ్ చేసేవారిపై కేసులు
- సానుకూలంగా స్పందించిన కమిషనర్



(ప్రజాస్ఫూర్తి, మేడ్చల్ జిల్లా) : ప్రైవేట్ పాఠశాలల పై దౌర్జన్యాలకు పాల్పడుతు, డబ్బులు డిమాండ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ట్రస్మా నాయకులు మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమెకు సంఘం ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేసింది. విద్యార్థి సంఘాల పేరుతో, కుల సంఘాల పేరుతో, ఆర్టిఐ యాక్టివిష్టుల పేరుతో పాఠశాల నిర్వాహకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు వాపోయారు. డబ్బు వాసులే ప్రధానంగా ఇలాంటివారు పాఠశాలల నిర్వహకులను ఇబ్బంది చేస్తున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తాజాగా ఉప్పల్ ప్రాంతంలో కొందరిపై కేసులు నమోదు అయినట్లు కూడా ఆమెకు తెలిపారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం:**

వసుళ్ళకు పాల్పడుతున్నటువంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి తమకు స్పష్టమైన హామీని ఇచ్చారని వారు ఈ సందర్భంగా తెలిపారు. పాఠశాల నిర్వహకుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్న వారిని ఉపేక్షించవద్దని సూచించారు. ఎవరు డబ్బులు డిమాండ్ చేసిన వెంటనే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయాలని ట్రస్మా సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిరు ఆంజనేయులు, ఉప్పల్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, పలు పాఠశాలల కరస్పాండెంట్స్ కిరణ్ కుమార్ రెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అకాలేషియా బాధితురాలికి అరుదైన కోతలు లేని చికిత్స

* యశోదా ఆస్పత్రిలో విజయవంతమైన 'పోయం' ప్రక్రియ




నల్గొండ,ప్రజస్ఫూర్తి : ఆహారం మింగడంలో ఇబ్బంది, తిన్న ఆహారం తిరిగి నోటికి రావడం వంటి సమస్యలతో బాధపడుతున్న నల్గొండ జిల్లాకు చెందిన 52 ఏళ్ల మహిళకు మలక్‌పేట యశోదా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆధునిక చికిత్స అందించారు. జీర్ణాశయ వ్యాధుల నిపుణుడు డా. కిషన్ నున్వత్ ఆధ్వర్యంలో పెర్-ఓరల్ ఎండోస్కోపిక్ మయోటమీ (పోయం) విధానాన్ని విజయవంతంగా నిర్వహించారు. కొంతకాలంగా ఆహారం మింగలేకపోవడం, తిన్న పదార్థాలు తిరిగి నోటికి రావడం, క్రమంగా బరువు తగ్గడం వంటి లక్షణాలతో బాధపడుతున్న సదరు మహిళకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో టైప్-2 అకాలేషియా కార్డియా ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో ఎలాంటి బాహ్య కోతలు లేకుండా నోటి మార్గం ద్వారా పోయం ప్రక్రియను చేపట్టారు. చికిత్స అనంతరం రోగి ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడిందని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డా. కిషన్ నున్వత్స మాట్లాడుతూ అకాలేషియా కార్డియా అనేది అన్నవాహిక దిగువ భాగంలోని కండరాలు సాధారణంగా సడలకపోవడం వల్ల ఆహారం, ద్రవాలు కడుపులోకి చేరడంలో ఇబ్బంది కలిగించే అరుదైన వ్యాధి అని తెలిపారు. ఆహారం మింగడంలో సమస్య, తిన్న ఆహారం తిరిగి రావడం, ఛాతీలో నొప్పి లేదా అసౌకర్యం, కారణం లేకుండా బరువు తగ్గడం వంటి లక్షణాలు ఈ వ్యాధిలో కనిపిస్తాయని వివరించారు. "పోయం విధానంలో ఎలాంటి బాహ్య శస్త్రచికిత్స అవసరం ఉండదు. ప్రత్యేక ఎండోస్కోపిక్ పరికరాల సహాయంతో ఆహార ప్రవాహానికి అడ్డుగా ఉన్న కండరాలను లోపలి నుంచి సడలించి, ఆహారం సులభంగా కడుపులోకి చేరేలా చేస్తాం" అని ఆయన వివరించారు. ఈ విధానం ద్వారా నొప్పి తక్కువగా ఉండటంతో పాటు రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని, శరీరంపై శస్త్రచికిత్స మచ్చలు ఉండవని, ఆస్పత్రిలో ఉండే సమయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఆహారం లేదా ద్రవాలు మింగడంలో ఇబ్బంది, తిన్న ఆహారం తిరిగి నోటికి రావడం, ఛాతీలో నొప్పి, తరచూ ఆహారం గొంతులో ఇరుక్కుపోవడం, కారణం లేకుండా బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే జీర్ణాశయ వ్యాధుల నిపుణులను సంప్రదించాలని డా. కిషన్ నున్వత్స సూచించారు. అకాలేషియా కార్డియా చికిత్సలో పోయం విధానం ప్రపంచవ్యాప్తంగా సమర్థవంతమైన చికిత్సా విధానంగా గుర్తింపు పొందిందని, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే దీర్ఘకాలిక ఉపశమనం పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఆయన తెలిపారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం

* ఎన్ఎస్ యుఐ జిల్లా అధ్యక్షులు సురేష్ నాయక్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం ఎన్ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్థూపం వద్ద ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జి, రాహుల్ గాంధీ అక్రమ అరెస్టుపై శాంతియుత నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా అజ్మీర సురేష్ నాయక్ మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం, రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తలారి మధు, ఉర్సు శివ, బానోత్ శ్రీధర్, షేక్ సమీర్, కాటి సందీప్, ఎస్.కె నయన్ ఉబ్బపల్లి నికిల్, తదితరులు పాల్గొన్నారు.

# పనిచేస్తున్న సంస్థకే కన్నం.. భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు




హైదరాబాద్: బంజారాహిల్స్‌లో భారీ చోరీ కేసును టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. పనిచేస్తున్న సంస్థకే కన్నం వేసి కిలోకి పైగా బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన సోదరులు సోంకాంబ్లే హరీశ్, సోంకాంబ్లే ఆకాశ్‌ను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. ఈ మేరకు వివరాలను ఆయన వెల్లడించారు. ''ఓ జ్యువెలరీ సంస్థలో హరీశ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. కంపెనీ లాకర్‌లో ఉన్న బంగారు ఆభరణాలపై నిందితుడు ముందే నిఘా పెట్టాడు. ఈనెల 16న చోరీకి యత్నించి విఫలమయ్యాడు. 17న విద్యుత్ సరఫరా నిలిపివేసి బాత్రూమ్ గ్రిల్స్ తొలగించి లోపలికి ప్రవేశించాడు. లాకర్‌లోని బంగారు ఆభరణాలను అపహరించాడు. దొంగిలించిన బంగారాన్ని సోదరుడు ఆకాశ్ వద్ద దాచిపెట్టాడు. నిందితులను అరెస్ట్ చేసి కిలోకు పైగా (1,028 గ్రాములు) బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నాం'' అని డీసీపీ తెలిపారు.

# విద్యార్థులపై పాశవికంగా లాఠీ చార్జ్ చేసి అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలి

* సిపిఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్




జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : న్యూ ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పాశవికంగా లాఠీ చార్జ్ చేసి అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేసి నీట్ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సిపిఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ రైతు బజార్ నుండి ఉషోదయ టవర్స్ వరకు నిర్వహించిన ర్యాలీ లో సిపిఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూన్యూ ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీనీ వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం వ్యక్తం చేస్తున్న. విద్యార్థులపై. పాశవిక లాఠీచార్జిని ఖండిస్తూ అక్రమ కేసులను ఎత్తివేయాలన్నారు.సోనం వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకతను తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును రక్షించడం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత ఆ బాధ్యతలను విస్మరించి ప్రజా ఉద్యమాలను అణచివేయడం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి పాలన చేయాలనుకుంటే. ప్రభుత్వమనుగడ ప్రశ్నార్థకమవుతుందని అన్నారూ ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పసుల అంజయ్య ఈ దేవదానం కే శీను మల్లారెడ్డి ఆంజనేయులు దుర్గా నాయక్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు

# బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

* మెదక్ ఎస్పీ శ్రీనివాస రావు




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, వారి బాల్యాన్ని పనులకు కాకుండా విద్యకు అంకితం చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు అన్నారు. బాలల చేతుల్లో పనిముట్లు కాకుండా పుస్తకాలు ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల దేశ భవిష్యత్తు అంధకారంగా మారే ప్రమాదం ఉందని, ప్రపంచంలో అత్యధిక యువ జనాభా కలిగిన దేశాల్లో భారత్ ముందంజలో ఉందని, ఈ యువతే దేశ భవిష్యత్తుకు బలమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూలై 1 నుంచి నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని హోటళ్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి వెంటనే రక్షించాలని అధికారులను ఆదేశించారు. రక్షించిన చిన్నారులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ముందు హాజరుపరిచి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించాలని సూచించారు. విధుల్లో ఉన్న సమయంలో ఎలాంటి సమస్యలు లేదా ఇబ్బందులు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైన సహకారం అందిస్తామని సూచించారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.సమన్వయ సమావేశంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జార్జ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సతేంద్ర ప్రసాద్, విద్యా, వైద్య శాఖల అధికారులు, ఎన్‌జీవో ప్రతినిధులు, రెండు డివిజన్లకు చెందిన ఆపరేషన్ ముస్కాన్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంకెళ్లతో నిరసన ప్రదర్శన



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడమే కాకుండా టియర్ గ్యాస్ ప్రయోగించి విద్యార్థులను దారుణంగా కొట్టినటువంటి సంఘటనలకు వ్యతిరేకంగా, ఆ సమయంలో విద్యార్థులకు మద్దతుగా వచ్చినటువంటి కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు.. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి, ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ ఆలి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ తదితరులు తమ చేతులకు సంకెళ్లు వేసుకొని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమతా నాగిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,, కౌన్సిలర్లు డాక్టర్ ఊర రామమూర్తి యాదవ్, కుంభం రాజేందర్, పిల్లల రమేష్ నాయుడు, ఫారుక్,చంచల నిఖిల్,ఎస్ ఎస్ సాజిద్, భైరు వెంకన్న గౌడ్, బంటు చొక్కయ్య తదితరులు పాల్గొన్నారు

# అధిక ధరలకు యూరియా విక్రయిస్తే లైసెన్సులు రద్దు

* కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి ) : రైతులకు ఎరువులు నిర్ణీత ధరలకే అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. యూరియాను అధిక ధరలకు విక్రయించినా, అక్రమంగా నిల్వ చేసి విక్రయించినా సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడే దుకాణాల లైసెన్సులను రద్దు చేయాలని స్పష్టం చేశారు.బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ, సహకార శాఖ అధికారులతో పాటు ఇఫ్కో, కోరమాండల్ కంపెనీల ప్రతినిధులు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఫెర్టిలైజర్ హోల్‌సేల్ డీలర్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా ఎరువుల విక్రయాలను మరింత విస్తరించి రైతులకు సకాలంలో అందించాలని ఆదేశించారు. మండలాల వారీగా ఎరువుల వినియోగంపై సమగ్ర నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు నానో యూరియా వినియోగంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. యూరియాను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, సహకార అధికారి వాలియా నాయక్, భూపాలపల్లి, మహదేవపూర్ ఏడీఏలు రమేష్, శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో చలో లోక్‌భవన్.. మంత్రులు, కాంగ్రెస్ నేతల అరెస్ట్



హైదరాబాద్: దిల్లీలో నిన్న ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో పాటు విపక్షనేతల అరెస్టుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో చలో లోక్‌భవన్ కార్యక్రమం చేపట్టారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యా లీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు.

* **రాహుల్ పోరాటానికి అందరూ అండగా నిలవాలి: భట్టి విక్రమార్క**

ప్రధాని మోదీ నివాసం వద్ద నిరసన తెలిపిన రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. హనుమకొండ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. ''ప్రతిపక్ష పార్టీ నేతలను కర్కశంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమే. నీట్ పరీక్ష పత్రాల లీకేజీతో దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైంది. ఆ అక్రమాలపై ప్రశ్నిస్తూ ఆందోళనకు దిగిన విద్యార్థులు, యువత పట్ల పోలీసులు విచక్షణా రహితంగా వ్యవహరిస్తూ లాఠీఛార్జ్ చేయడం అత్యంత దుర్మార్గం. మోదీ హయాంలో దేశంలో అరాచక పాలన కొనసాగుతోంది. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలి. విద్యావ్యవస్థను రక్షించుకునేందుకు రాహుల్‌గాంధీ చేస్తున్న ఈ పోరాటానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి'' అని భట్టి విక్రమార్క అన్నారు.

# గిగ్ వర్కర్లు, క్యాబ్ డ్రైవర్ల కష్టాలపై కవిత ఆవేదన

స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థల్లో పనిచేస్తున్న లక్షలాది మంది డెలివరీ వర్కర్లు, ఆటో, క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా కష్టపడినా వారికి వచ్చే ఆదాయం కుటుంబ పోషణకు కూడా సరిపోవడం లేదని అన్నారు. గత మూడేళ్లుగా ఛార్జీలు పెంచాలని అడుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి పట్ల నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. అగ్రిగేటర్ సంస్థలు భారీగా కమీషన్ల కోత విధిస్తూ, అన్యాయంగా రేట్లను నియంత్రిస్తుండటంతో డ్రైవర్లు, డెలివరీ బాయ్స్ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. గిగ్ వర్కర్లు, డ్రైవర్ల పక్షాన ప్రభుత్వం నిలబడాలని, వెంటనే అగ్రిగేటర్ సంస్థలతో చర్చలు జరిపి ఛార్జీలు పెంచేలా చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం వీరంతా 'వర్క్ బ్రేక్ డౌన్' వంటి నిరసనబాట పట్టే పరిస్థితి తెప్పించకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. గిగ్ వర్కర్లు చేస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతుగా ఉంటుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

సినిమా

# ఇక ఆ పని చేయను..

ఐశ్వర్య లక్ష్మి సోషల్ సోషల్ మీడియాకు దూరంగా ఉంటానని మరోసారి చేసింది.గత ఏడాది ఇన్‌స్టాగ్రామ్‌కు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో యాక్టివ్‌గా లేదు. ప్రస్తుతం సోషల్ మీడియా లేకుండా ప్రశాంతంగా జీవిస్తున్నానని చెప్పింది. 'సోషల్ మీడియాలో సేఫ్టీగా ఉన్నాననే భావన లేదు. పని చేయడం కూడా జీవితం సులభంగా మారింది' అని పేర్కొంది. ఫొటోలను మార్ఫింగ్ చేయడం, అవమానకరమైన కామెంట్స్ చేయడంతో తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొన్నట్లు చెప్పింది. 'అలాంటి పోస్టులు, కామెంట్లు చూసి అందరూ నన్ను ద్వేషిస్తున్నారేమో అన్న భావన కలిగేది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కాకుండా నేరుగా అభిమానులను, ప్రజలను కలవడానికే ఇష్టపడుతున్నాను. రూ.100కోట్లు ఇచ్చినా మళ్లీ సోషల్ మీడియా వైపు వెళ్లను' అని తేల్చి చెప్పింది. ఐశ్వర్య లక్ష్మి ప్రస్తుతం తెలుగులో సాయి ధరమ్ తేజ్ సరసన సంబరాల ఏటి గట్టు మూవీలో నటిస్తోంది.





# దక్షాకు మరో ఛాన్స్

హీరోయిన్‌గా గుర్తింపు కోసం టాలీవుడ్‌లో అడుగుపెట్టిన దక్షా నగార్కర్‌కు ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం దక్కలేదు. దీంతో ప్రస్తుతం స్పెషల్ సాంగ్స్‌పై ఫోక్ చేస్తోంది. ఇటీవల 'నాగబంధం' సాంగ్‌లో మెరిసిన దక్షా.. ప్రస్తుతం వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కుతున్న 'కొరియన్ కనకరాజు' సినిమాతో మాస్ సాంగ్‌లో స్పెషల్ అప్పియరెన్స్ ఇస్తోంది. ఈ పాటతో తన కెరీర్‌కు మరో మలుపు తిరుగుతుందనే ఆశలు పెట్టుకుంది. దక్షా తెలుగులో 'జాంబీ రెడ్డి' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'బంగార్రాజు'లో స్పెషల్ సాంగ్‌తో ఆకట్టుకోగా, రవితేజ 'రావణాసుర' లో కీలక పాత్రలో నటించింది. అయితే ఆ చిత్రాలు ఆమె కెరీర్‌కు పెద్దగా ఉపయోగపడలేదు. ఇప్పుడు 'కొరియన్ కనకరాజు'పై దక్షా ఆశలు పెట్టుకుంది. రాయలసీమ జాతర నేపథ్యంలో సాగే 'రాసా గుమ్మాడి' పాటలో వరుణ్ తేజ్‌తో కలిసి ఆమె మాస్ స్టెప్పులు వేసింది. థమన్ స్వరపరి చిన ఈ పాట ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్-కామెడీ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'రాసా గుమ్మాడి' పాట హిట్ అయితే దక్షాకు మరిన్ని కమర్షియల్ సినిమాల్లో అవకాశాలు వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# ఇన్‌స్టాతో జాన్వీకి దండిగా ఆదాయం!

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్‌కు సోషల్ మీడియా ద్వారా భారీగానే ఆదాయాన్ని కూడబెడుతున్నది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో జాన్వీని 2.68 కోట్ల మందికిపైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఎక్స్‌తో పాటు ఇతర ప్లాట్‌ఫారమ్స్‌లోనూ భారీగానే అభిమానగనం ఉన్నది. దీంతో దేశీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖ బ్రాండ్లు తమ ఉత్పత్తుల ప్రచారం కోసం ఆమెతో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. సమాచారం ప్రకారం.. జాన్వీ ఇన్‌స్టాగ్రామ్‌లో చేసే ఒక్కో స్పాన్సర్డ్ పోస్టుకు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఛార్జ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్స్‌లో పోస్టులకు లక్షల్లోనే తీసుకుంటున్నట్లు సమాచారం. ప్రముఖ కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్ వ్యవహరిస్తుండగా.. భారీగా ఆదాయం వస్తుందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. సోషల్ మీడియాతో నెలకు రూ.1.5 కోట్లకుపైగా సంపాదిస్తున్నట్లు అంచనా. సినిమాల్లోనూ జాన్వీకి మంచి డిమాండ్ ఉంది. బాలీవుడ్‌లో ఒక్కో చిత్రానికి సుమారు రూ.6 కోట్ల వరకు రెమ్యూనరేషన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



# బన్నీతో వన్స్‌మోర్!

పూజా హెగ్డే టాలీవుడ్‌లో రెండు భారీ ప్రాజెక్టుల్లో ఛాన్స్ దక్కినట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్-లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఏఏ23లో పూజా పేరును ఖరారు చేసినట్లు సమాచారం. అలాగే రవితేజ, శ్రీ విష్ణు హీరోలుగా హసిత్ గోలి దర్శకత్వంలో రూపొందనున్న మల్టీస్టారర్‌లోనూ ఓ హీరోయిన్ పాత్ర కోసం పూజాను ఫైనల్ చేసినట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. ఈ రెండు కొత్త ప్రాజెక్టులకు సంబంధించి అఫీషియల్‌గా ప్రకటన రావాల్సి ఉంది. గతంలో బన్నీతో దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురము చిత్రాల్లో నటించింది. ఇక ప్రస్తుతం పూజా నటించిన జన నాయగన్ విడుదలకు సిద్ధమైంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.